సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 13 । ఫిబ్రవరి । 2023



ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

మొగల్తూరు : ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.



పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మ తల్లి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు జరిగాయి.

శ్రీవారి సేవలో..



ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రాన్ని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ సందర్శించారు.

న్యూస్‌రీల్

యాత్రలకు అనుమతి లేదు



మాట్లాడుతున్న డీఎస్పీ మనోహరచారి

పాలకొల్లు సెంట్రల్ : ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉండటం వల్ల ఎవరూ ఎలాంటి యాత్రలు చేయరాదని నరసాపురం డీఎస్పీ కె.రవిమనోహరాచారి అన్నారు. ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 6న పాలకొల్లులో జరిగిన పాస్టర్ల ర్యాలీలో, కరపత్రాల్లో హిందువులపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారంటూ పీవీఎస్ కుమార్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై లీగల్ ఒపీనియన్‌కు పంపించామని, నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామన్నారు. అయితే సోషల్ మీడియాలో చలో పాలకొల్లు అంటూ హిందూ జాగరణ యాత్ర పేరుపై కరపత్రాలు, వీడియో ప్రచారం చేస్తున్నారని, ప్రస్తుతం రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటం వల్ల ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఎన్నికల చట్టాన్ని అతిక్రమించి శాంతిభద్రతల సమస్యలు తలెత్తేలా కార్యాచరణ చేపట్టవద్దని, సంయమనం పాటించాలని సూచించారు. పట్టణ ఎస్సై బాదం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొనసాగిన వైద్యశిబిరం



పోలవరం ప్రాజెక్టు వద్ద నిర్వహిస్తున్న క్యాంపు

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు వద్ద అస్వస్థతకు గురైన కార్మికుల చికిత్స కోసం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆర్డీఓ ఎం.ఝాన్సీరాణి ఆదివారం పరిశీలించారు. వైద్యశాలలో వింజరం పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.మురళీకృష్ణ, కె.వాసు సిబ్బందితో కలిసి ఆదివారం కూడా అనారోగ్యానికి గురైన పలువురికి చికిత్స అందించి మందులు అందజేశారు. మెడికల్ క్యాంపులో నలుగురికి చికిత్స చేరారని, వారికి సెలైన్ ఎక్కించి చికిత్స అందిస్తున్నామని వైద్యాధికారులు ఆర్డీఓకు తెలిపారు. చికిత్స పొందిన వారి ఆరోగ్య పరిస్థితులు మెరుగ్గా ఉన్నాయని, కొత్తగా ఎవరూ చికిత్స నిమిత్తం రాలేదన్నారు. మెడికల్ క్యాంపు కొనసాగుతుందని, మెరుగైన వైద్యం కోసం తరలించేందుకు అంబులెన్స్ కూడా ఏర్పాటు చేశామని వైద్యాధికారులు చెప్పారు.

చేయూత మార్టులతో మహిళా సాధికారత

ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు

చింతలపూడి : చేయూత మార్టుల ద్వారా మహిళా అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు అన్నారు. చింతలపూడిలో చేయూత మహిళా మార్ట్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. మార్ట్ నిర్వహణపై మహిళా సంఘ సభ్యులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. ఎన్నికల్లో హామీ మేరకు ప్రతి పథకంలోనూ మహిళలకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామన్నారు. మహిళలు స్వశక్తితో ఎదగాలని, వారిని వ్యాపార రంగంలో అగ్రగాములుగా మార్చాలన్న ఏకైక లక్ష్యంతో మహిళా మార్టులకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుమారు రూ.45 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌ను విజయవంతం చేయాల్సిన బాధ్యత ద్వాక్రా మహిళలపై ఉందన్నారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు కూడా నూతనంగా ప్రారంభించిన మహిళా మార్ట్‌లో నిత్యావసరాలు కొనుగోలు చేసి మహిళలకు చేయూత అందించాలని పిలుపునిచ్చారు. ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, ఏపీఎం జ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకులు గిరి భోగారావు, మధ్యాహ్నపు బలరామ్ ఉన్నారు.

కలిదిండిలో జిల్లాస్థాయి స్పందన రద్దు

కైకలూరు: ఏలూరు జిల్లాస్థాయిలో కలిదిండిలో సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని అనివార్య కారణాల వల్ల రద్దు చేసినట్టు ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయ సిబ్బంది ఆదివారం తెలిపారు. ఏలూరులోని కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరం, డివిజనల్, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో యథాతథంగా కార్యక్రమం నిర్వహిస్తారని, ప్రజలంతా కోవిడ్ నిబంధనలు పాటించాలని సూచించారు.

నిషేధిత ఔషధాలతో చీకటి దందా



అధికారులు స్వాధీనం చేసుకున్న అబార్షన్ కిట్లు, వయాగ్రా మందులు

తణుకు: తీగ లాగితే ఏకంగా డొంక కదులుతోంది.. ఇన్నాళ్లు చాప కింద నీరులా సాగుతున్న అక్రమ మందుల వ్యాపారంపై ఔషధ నియంత్రణ అధికారులు గురిపెట్టారు. తణుకులో సోదాలు చేయడంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఉన్న అక్రమ వ్యాపారుల దందా బయట పడుతోంది. దీంతో పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమ మందులను సరఫరా చేస్తున్న వారి వివరాలను అధికారులు కూపీ లాగుతున్నారు. ప్రభుత్వం నిషేధించిన మందులను రిటైల్ మందుల దుకాణాలు, హోల్‌సేల్ దుకాణాలతోపాటు ఏకంగా కిరాణా షాపుల్లో సైతం విక్రయిస్తున్నారంటే పరిస్థితి అర్థమవుతోంది. ఒకేరోజు నాలుగు ప్రాంతాల్లో దాడులు చేసిన అధికారులు వాటికి కొనసాగింపుగా తాజాగా పాలకొల్లు, భీమవరం, ఏలూరు ప్రాంతాల్లో సైతం ఈ తనిఖీలు చేపట్టారు. తణుకు, భీమవరం డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు అబిద్‌అలీ, మల్లికార్జునరావు ఆధ్వర్యంలో సోదాలు కొనసాగుతున్నాయి.

గుట్టురట్టు

- ఉమ్మడి జిల్లాలో యథేచ్ఛగా అక్రమ మందుల విక్రయాలు
- మార్కెట్‌లో విచ్చలవిడిగా వయాగ్రా, అబార్షన్ కిట్లు
- ఏకధాటిగా ఔషధ నియంత్రణ అధికారుల దాడులు
- జిల్లా నుంచి పొరుగు రాష్ట్రాలకు లింకులపై ఆరా

ఎమ్మార్పీలు చెరిపేసి..

తక్కువ సమయంలో ఎక్కువ సొమ్ములు ఆర్జించాలనే ఉద్దేశంతో కొందరు అక్రమార్కులు ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో వైద్యపరంగా తణుకు కేంద్రంగా ఉంది. ఇక్కడ ప్రైవేట్ ఆసుపత్రులే కాకుండా మెడికల్ రిటైల్, హోల్‌సేల్ దుకాణాలు పెద్ద ఎత్తున ఉన్నాయి. ఇదే అవకాశంగా కొందరు అక్రమార్కులు మందుల దుకాణాల ముసుగులో అక్రమ మందుల విక్రయాలకు తెరతీశారు. ముఖ్యంగా మత్తుకోసం వినియోగించే అల్ప్రాజోలం, సెక్స్ సామర్థ్యాన్ని పెంచే వయాగ్రా, గర్భవిచ్ఛిత్తి కోసం వాడే అబార్షన్ కిట్లు పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకుంటున్న వ్యాపారులు పీఎంపీలు, ఆర్‌ఎంపీలకు విక్రయిస్తున్నట్లుగా విచారణలో వెల్లడైంది. మరోవైపు పొరుగు రాష్ట్రాల నుంచి తీసుకువస్తున్న మందులు, అబార్షన్ కిట్లపై ఎమ్మార్పీ ధరలు, బ్యాచ్ నంబర్లను శానిటైజర్‌తో తుడిచి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లుగా సమాచారం. తణుకులోని వెంకటేశ్వర థియేటర్ సెంటర్‌లో వెంకటసాయి మెడికల్ స్టోర్‌లో నిషేధిత మందులు విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న అధికారులు దాడి చేశారు. అయితే తణుకు మండలం వెంకట్రాయపురంలోని ఒక రేకుల షెడ్డులో పెద్ద మొత్తంలో మందులను నిల్వ ఉంచి అక్కడి నుంచి హోల్‌సేల్, రిటైల్ షాపులకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ఇదిలా ఉంటే కిరాణా షాపుల్లో సైతం వీటిని విక్రయిస్తున్నారంటే ఎంత విచ్చలవిడిగా చీకటి వ్యాపారం కొనసాగుతుందో అర్థమవుతోంది.

డాక్టర్ చీటీ లేకుండానే..

అబార్షన్ కిట్లు విక్రయించాలన్నా.. వయాగ్రా మాత్రలు అమ్మాలన్నా.. నిద్రమాత్రలు ఇవ్వాలన్నా డాక్టర్ ప్రిస్క్రిప్షన్ తప్పనిసరిగా ఉండాలి. అంతేకాకుండా బిల్లుతో సంబంధిత మందులు విక్రయించాల్సి ఉంటుంది. అయితే మందుల వ్యాపారంలో ఆరితేరిన కొందరు హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు ప్రాంతాల్లోని మెడికల్ రిప్రజెంటేటివ్‌ల ద్వారా వీటిని దిగుమతి చేసుకుని నిల్వ చేసుకుంటున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఏజెంట్లను సైతం నియమించుకుంటున్నారు. ఇదే తరహాలో దాదాపు ఐదు నెలల క్రితం పాలకొల్లులో దాడి చేసిన అధికారులు పెద్దమొత్తంలో అక్రమ మందులను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే జిల్లాలో గంజాయి పెద్ద ఎత్తున వినియోగం జరుగుతుండగా ఇప్పుడు అక్రమ మందులు ముఖ్యంగా అబార్షన్ కిట్లు, వయాగ్రా, ఇతరత్రా మత్తు మందుల అమ్మకాలు జోరుగా సాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.



పాలకోడేరు మండలం మోగల్లులో దాడుల్లో పాల్గొన్న అధికారులు



ఎమ్మార్పీ, బ్యాచ్ నంబర్లు చెరిపేసి..

రూ.25 లక్షల విలువైన మందుల సీజ్



నిషేధిత మందుల వినియోగం, విక్రయాలపై దృష్టి సారించాం. తణుకు కేంద్రంగా అక్రమ మందుల వ్యాపారం యథేచ్ఛగా సాగుతోంది. తణుకు ఔషధ నియంత్రణ కార్యాలయ పరిధిలో ఏడాది కాలంలో 9 కేసులు నమోదు చేశాం. ఈ కేసుల్లో దాదాపు రూ.25 లక్షల విలువైన అక్రమ మందులను సీజ్ చేశాం. నిషేధిత మందులు ఎక్కడ నుంచి దిగుమతి అవుతున్నాయనే కోణంలో దర్యాప్తు చేస్తున్నాం.

– అబిద్‌అలీ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, తణుకు

మోగల్లులో సోదాలు

పాలకోడేరు: నిషేధిత ఔషధాలు విక్రయిస్తున్న దుకాణంపై అధికారులు దాడి చేసి కేసు నమోదు చేశారు. మండలంలోని మోగల్లులో ఖండవల్లి సుధాకర్ అనే వ్యక్తి అల్ప్రాజోలం, వయాగ్రా తదితర ఔషధాలను అనధికారికంగా విక్రయిస్తున్నారు. భీమవరం, తణుకు ఔషధ తనిఖీ అధికారులు ఆదివారం అతడి ఇంటిపై దాడి చేసి రూ.2.80 లక్షల విలువైన ఆరు రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు. వీటిని వేర్వేరు ప్రాంతాల నుంచి తీసుకువచ్చి ఆర్‌ఎంపీలకు, మెడికల్ షాపులకు విక్రయిస్తున్నట్టు అధికారులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, ఔషధాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఎక్స్‌ప్రెస్ సర్వీసుల స్టేజీల సవరణ

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు శ్రీపర్రును ఫేర్ స్టేజ్‌గా పరిగణిస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.వీరయ్యచౌదరి ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో ఏలూరు నుంచి కైకలూరు వరకు ఒకటే ఫేర్ స్టేజ్‌గా పరిగణించడం వలన శ్రీపర్రు, మాదేపల్లి గ్రామాల ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీంతో స్టేజీలను సవరించామని పేర్కొన్నారు. నరసాపురం-ఏలూరు ఎక్స్‌ప్రెస్ సర్వీసు స్టేజీలను ఆయన వివరించారు. నరసాపురం, పాలకొల్లు, లంకల కోడేరు (రిక్వెస్ట్ స్టాప్), వీరవాసరం, భీమవరం, ఉండి, ఆకివీడు, ఆలపాడు-భుజబలపట్నం (రిక్వెస్ట్ స్టాప్, కైకలూరు, శ్రీపర్రు-మాదేపల్లి (రిక్వెస్ట్ స్టాప్), ఏలూరుగా సవరించామని తెలిపారు.

మహాశివరాత్రికి 43 ప్రత్యేక బస్సులు

భీమవరం (ప్రకాశంచౌక్): మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల సందర్శనార్థం 43 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.వీరయ్యచౌదరి ఓ ప్రకటనలో తెలిపారు. తాడేపల్లిగూడెం నుంచి వీరంపాలెం 30, పట్టిసీమకు 13 ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు చెప్పారు. ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

లైంగిక దాడిపై ఫిర్యాదు

తాడేపల్లిగూడెం అర్బన్: తనపై ఓ వ్యక్తి పలుమార్లు లైంగికదాడికి పాల్పడినట్టు యువతి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆదివారం పట్టణ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన మార్నీడి ప్రసాద్ క్రాకర్స్ వ్యాపారం చేస్తుంటాడు. ఇతనికి పరిచయం ఉన్న ఎస్సీ యువతి తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి ప్రసాద్ పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్టు ఫిర్యాదు చేసింది. ప్రసాద్ కుటుంబసభ్యులు, స్నేహితుల సహకారంతో కుట్రపన్ని తనను వంచించాడని ఆరోపించింది. యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో విచారణ చేపట్టనున్నట్టు సీఐ చెప్పారు.

శ్రీధృతి.. విస్తృతి

అదిరింది రబీ

- ఉమ్మడి జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో సాగు
- ప్రతి సీజన్‌లోనూ విస్తరిస్తున్న పంట
- దిగుబడులు బాగుండటంపై రైతుల మక్కువ
- ఉత్సాహంగా సార్వా సాగు



ఆకివీడు: అధిక దిగుబడులే లక్ష్యంగా ఆశల సార్వా మొదలైంది. గోదావరి జలాల్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుని తక్కువ రోజుల్లో దిగుబడులు వచ్చే వంగడాలపై రైతులు దృష్టి సారించారు. దీంతో ఎంటీయూ 1121 (శ్రీధృతి), ఎంటీయూ 1153, ఎంటీయూ 1156, వంగడాలతో పాటు పీఆర్ 126 (సన్నాలు), సెలినిటీని తట్టుకునే ఎంటీయూ 1318, ఎంసీఎం 100 తదితర వంగడాల్ని సాగు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అత్యధిక శాతం మంది రైతులు శ్రీధృతి రకాన్ని సాగుచేస్తున్నారు. ఈ రకం 130–135 రోజుల వ్యవధిలో పంట చేతికి వస్తుంది. సుమారు 35 బస్తాల దిగుబడి ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో 50 బస్తాల వరకు గతంలో దిగుబడి నిచ్చింది. మధ్యస్థ గింజగా ఉన్న ఈ వంగడాన్ని మార్టేరు వరి పరిశోధనా సంస్థ రూపొందించింది. మినీ కిట్ల నుంచి సాగు దిశగా గతేడాది రైతులు రబీలో సాగు చేసి మంచి ఫలితాల్ని పొందారు.

సన్నాలపై మక్కువ

ముతక రకాలకు అంతగా డిమాండ్ లేకపోవడంతో సన్నాల సాగుపై రైతులు దృష్టి సారించారు. డెల్టా ప్రాంతంలో, గోదావరి, కృష్ణా నదుల సమీప ప్రాంతంలో సన్నాల రకాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. దీంతో ఇటీవల ఉమ్మడి జిల్లాలో పీఆర్ 126 పంజాబ్ రకం వంగడం సాగుకు రైతులు సిద్ధమయ్యారు. ఇది అధిక దిగుబడులు ఇవ్వడమే కాకుండా గింజలో నాణ్యత, ప్రమాణాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. ఈ రబీ సీజన్‌లో జిల్లాలో సుమారు 18 వేల ఎకరాల్లో పీఆర్ వంగడం సాగు చేశారు. రానున్న రోజుల్లో ఈ రకంపై రైతులు ఎక్కువ మక్కువ చూపే అవకాశాలు ఉన్నాయి. ఈ రకం బాస్మతి మాదిరిగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

వద్దన్నా.. వినకుండా..

రబీ సీజన్‌లో నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకుని రైతులు తక్కువ రోజుల్లో (120 నుంచి 130 రోజుల్లోపు) పంట వచ్చే ఎంటీయూ 1153, ఎంటీయూ 1156 రకాలను సాగు చేస్తున్నారు. వీటికి ప్రభుత్వ అనుమతి లేదు. ఈ విషయాన్ని గత ఏడాది రబీలోనే ప్రభుత్వం ప్రకటించింది. బియ్యపు గింజలో మచ్చ, దిగుబడిలో అధిక శాతం నూక వస్తుందని మిల్లర్లు నిరాకరించడంతో ప్రభుత్వం వీటి సాగును ఆపివేసింది. వ్యవసాయాధికారులు, ఆర్బీకే ఇన్‌చార్జిలు, వీఏఏలు గ్రామాల్లో తెలియజేసినా ఉమ్మడి జిల్లాలో సుమారు 60 వేల ఎకరాల్లో ఈ వంగడాల్ని సాగు చేస్తున్నారు. ఈ–క్రాప్ నమోదు కూడా పూర్తయ్యింది.

జిల్లా	సార్వా సాగు ఎకరాలు (లక్షల్లో)	ఈ–క్రాప్ ఎకరాలు (లక్షల్లో)
పశ్చిమగోదావరి	2.14	1.91
ఏలూరు	2.17	2.17

ఉప్పునీటిని తట్టుకునేలా..

పంట కాలువల్లో సెలనిటీ ప్రభావం అధికంగా ఉండటంతో సాధారణ వంగడాల దిగుబడి భారీగా పడిపోయింది. దీంతో రైతులు ప్రత్యామ్నాయంగా సెలనిటీని తట్టుకునే వంగడాలు ఎంటీయూ 1318, ఎంసీఎం 100 రకం వంగడాల్ని సుమారు 16 వేల ఎకరాల్లో సాగు చేశారు. భూగర్భ జలాల్లోని సెలనిటీ అధికంగా ఉండే ఉప్పునీటిని రొయ్యల చెరువుల్లో వాడటం, వాటిని పంట కాల్వలలోకి వదిలివేయడంతో సాగు నీరు, భూమిలో సెలనిటీ, ఉప్పుశాతం పెరిగింది.

ఈ–క్రాప్.. సక్సెస్

ఈ–క్రాప్ నమోదు ఏలూరు జిల్లాలో నూరు శాతం, పశ్చిమగోదావరి జిల్లాలో 89 శాతం పూర్తయ్యింది. ప్రస్తుతం ఈకేవైసీ ప్రక్రియ వేగంగా సాగుతోంది.

1153, 1156 వద్దు



రబీ సాగులో 1153 (చంద్ర), 1156 (తరంగిణి) రకం వంగడాల సాగుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. ఇవి బియ్యం తయారీలో ఇబ్బంది ఏర్పడుతుందని, ఎఫ్‌సీఐ తీసుకోవడం లేదని మిల్లర్లు ఆందోళన వ్యక్తం చేయడంతో సాగును నిలుపుదల చేసింది. ఈ విషయాన్ని గుర్తించాలి.

– జెడ్.వెంకటేశ్వరరావు, వ్యవసాయ సంచాలకుడు, పశ్చిమగోదావరి జిల్లా

వంతుల వారీ మేలు



రబీ సాగులో రైతులు యజమాన్య పద్ధతులు పాటించి నీటిని ఒబ్బిడిగా వాడాలి. ప్రతిచుక్కా అవసరమని భావించాలి. పంట, మురుగు కాలువలో నీటిని వృధా చేయవద్దు. వంతుల వారీ నీటి వాడకంతో రబీ సాగు గట్టెక్కేందుకు అందరూ సహకరించాలి.

– నంద్యాల సీతారామయ్య, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్, కుప్పనపూడి

క్లుప్తంగా

బైక్ దగ్ధం



దుండగులు నిప్పుపెట్టడంతో దగ్ధమైన బైక్

నూజివీడు: ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని అజరయ్యపేటకు చెందిన మట్ట కొయ్య రుషిబాబు బేకరీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఇతను తన ద్విచక్రవాహనాన్ని ఇంటి వద్ద పార్కింగ్ చేసి నిద్రపోయాడు. అయితే ఆదివారం ఉదయం ఆరు గంటల సమయంలో ఆగంతకులు ద్విచక్రవాహనానికి నిప్పు పెట్టారు. స్థానికులు గమనించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా, అప్పటికే ద్విచక్ర వాహనం పూర్తిగా దగ్ధమైంది. బాధితుడు రుషిబాబు ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై-1 కె.శివనారాయణ ఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటారు సైక్లిస్టుకు తీవ్ర గాయాలు

చింతలపూడి: స్థానిక డిగ్రీ కళాశాల సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల ప్రకారం చింతలపూడికి చెందిన కొండా రాజేష్ మోటార్‌సైకిల్‌పై వెళ్తూ ఆటోను ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతనిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా, మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై హరికృష్ణ తెలిపారు.

ముస్తాబవుతున్న శైవక్షేత్రాలు

- గునుపూడిలోని పంచారామక్షేత్రం ఉమాసోమేశ్వర జనార్దనస్వామి ఆలయంలో ముమ్మరంగా ఏర్పాట్లు
- 16 నుంచి 20వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలు
- 18న స్వామివారి కల్యాణం, 19న రథోత్సవం



శ్రీఉమాసోమేశ్వరస్వామి వారు



ద్వారకాతిరుమల ఆలయం ఎదుట భక్తులను ఆకట్టుకుంటున్న శివయ్య విగ్రహం

భీమవరం (ప్రకాశం చౌక్): గునుపూడిలోని పంచారామక్షేత్రం శ్రీఉమాసోమేశ్వర జనార్దనస్వామి వారి దేవస్థానం (సోమరామం)లో ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు మహాశివరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు భక్తులు భారీగా తరలిరానున్న నేపథ్యంలో ఈఓ ఎం.అరుణకుమార్ ధర్మకర్తల మండలి పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నారు. చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్లు, విద్యుత్ దీపాలంకరణ పనులతో పాటు భక్తులకు తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు

మహాశివరాత్రి మహోత్సవాలు జరిగే ఐదు రోజులూ శ్రీఉమాసోమేశ్వరస్వామి వారికి నిత్యం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తారు. మహోత్సవాల్లో భాగంగా ఈనెల 18వ తేదీ తెల్లవారుఝామున 5.13 గంటలకు అన్నపూర్ణ పార్వతీ సమేత శ్రీసోమేశ్వరస్వామి వారి పాంచాహ్నిక దీక్షా కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దంపతులు స్వామివారు, అమ్మవార్లకు పట్టువస్త్రాల సమర్పిస్తారు. 19వ తేదీ సాయంత్రం స్వామివారికి రథోత్సవం, 20వ తేదీ రాత్రి స్వామివారికి స్థానిక సోమగుండం చెరువులో తెప్పోత్సవం నిర్వహిస్తారు.

15 నుంచి ద్వారకాతిరుమలలో శివయ్య కల్యాణోత్సవాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమై, క్షేత్రపాలకునిగా విరాజిల్లుతున్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామివారి ఆలయం శివయ్య కల్యాణ మహోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ సందర్భంగా ఆలయాన్ని, పరిసరాలను దేవస్థానం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతోంది. ఆలయం ముందు చలువ పందిళ్ల నిర్మాణం, రంగులు వేసే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈనెల 15 నుంచి 21 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. దీనిలో భాగంగా 15న ఉదయం స్వామివారిని పెండ్లి కుమారునిగా, అమ్మవార్లను పెండ్లికుమార్తెలుగా ముస్తాబు చేస్తారు. 16న సాయంత్రం 7 గంటల నుంచి వినాయక పూజ, దీక్షాధారణ, యాగశాల ప్రవేశన, అంకురార్పణ, మండపారాధన, ధ్వజారోహణ, బలిహరణ కార్యక్రమాలు జరుగుతాయి. అలాగే 17న సాయంత్రం వేదపారాయణం, అభిషేకం, గ్రామోత్సవం, 18న శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాత్రి 9 గంటలకు లింగోద్భవ కాల అభిషేకం, స్వామివారి కల్యాణోత్సవం, గ్రామోత్సవం నిర్వహిస్తారు. 19న స్వామి వారికి అభిషేకం, అమ్మవార్లకు కుంకుమార్చన, సాయంత్రం గ్రామోత్సవం, 20న ఉదయం 9 గంటలకు త్రిశూలవారి వసంతోత్సవం, కోవెల ఉత్సవం, పూర్ణాహుతి, దీక్షావిరమణ, ధ్వజ అవరోహణ, 21న రాత్రి 7 గంటలకు ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్ప యాగోత్సవం జరుగుతుంది. ఈ వేడుకల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు కోరారు.



గునుపూడి పంచారామక్షేత్రంలో ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం



ద్వారకాతిరుమలలో ఆలయం ముందు చలువ పందిరి నిర్మిస్తున్న సిబ్బంది

సాహిత్య, కళారంగాల అభివృద్ధికి కృషి



రత్నరాశులు ద్విశతి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో కవులు, కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, సామాజిక మాధ్యమాల విస్తృతి పెరిగినా పుస్తక పఠనానికి ఆదరణ తగ్గదని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి స్పష్టం చేశారు. నగరానికి చెందిన సాంస్కృతిక సంస్థ అక్షరం ఆర్ట్స్ రజతోత్సవాలు ఆదివారం స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి హాలులో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీలక్ష్మి మాట్లాడుతూ తెలుగు సాహిత్య అకాడమీ ద్వారా సాహిత్య, కళారంగాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా సాహితీ వల్లరి డి.రాములు రచించిన రత్నరాశులు ఆటవెలదుల ద్విశతి గ్రంథాన్ని శ్రీలక్ష్మి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రముఖ రచయిత నూతలపాటి సాంబయ్య మాట్లాడుతూ సామాజిక ప్రయోజనం లేని సాహిత్యమే వ్యర్థమని, సమాజంలోని రుగ్మతలను ప్రశ్నించేవిధంగా, రూపుమాపేవిధంగా ఉండే సాహిత్యమే ప్రజల హృదయాలలో నిలిచి ఉంటుందన్నారు. ప్రముఖ సాహితీవేత్త లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అలతి అలతి పదాలలో విస్తృత అర్థం వచ్చేలా వేమన వేసిన బాటలో డి.రాములు ఆటవెలది ఛందస్సులో పద్యాలు రాస్తూ శతక పద్య రచనా వారసత్వాన్ని కొనసాగించడం అభినందనీయమన్నారు. కళాదిత్య డి.రాములు మాట్లాడుతూ 25 వసంతాలుగా సాహిత్య, కళారంగాలలో అక్షరం ఆర్ట్స్ కృషి చేస్తోందన్నారు. నాట్య గురు మేదరమెట్ల శిరీష మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను చదువులతో పాటు కళల వైపు ప్రోత్సహించాలన్నారు. ఆలపాటి నాగేశ్వరరావు, పెదపాటి రామకృష్ణ, మోతే శ్రీనివాస నారాయణరావు, వీజీఎం ఆర్ కృష్ణారావు, మజ్జి కాంతారావు ప్రసంగించారు. శ్రీపాద శ్రీవల్లభ కూచిపూడి నాట్య నిలయం విద్యార్థినులు ప్రదర్శించిన పుష్ప విలాపం కూచిపూడి నాట్యం ఆకట్టుకుంది. నాట్య గురు మేదరమెట్ల శిరీషకు అక్షరం ఆర్ట్స్ సంస్థ తరుపున ఆమె కూచిపూడి నాట్యానికి చేస్తున్న కృషిని గుర్తించి నాట్య మయూరి బిరుదును ఇచ్చి సత్కరించారు. నాట్య బాలలు శ్రీ అక్షర, ద్యుతిశ్రీ, చిన్మయి, సుహాని, మానస మాతృమూర్తులకు అక్షరం ఆత్మీయ పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగాస్త్ర, పుల్లాభొట్ల పురుషోత్తమరావు, దువ్వి హేమసుందర్, కస్తూరి రావు, బి.రాంబాబు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలలు మరిన్ని ఏర్పాటు కావాలి



మాట్లాడుతున్న రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కె.మహ్మద్ ఇక్బాల్

దెందులూరు: రాష్ట్రంలో వందకుపైగా ఉర్దూ పాఠశాలలు ఏర్పాటు కావాలని ఏపీ రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కే.మహ్మద్ ఇక్బాల్ అన్నారు. ఆదివారం రాత్రి జోగన్నపాలెంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జూనియర్ కళాశాలలో ఫౌండర్, ప్రిన్సిపల్ మహ్మద్ వలీవుల్లా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇక్బాల్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నిపుణులైన అధ్యాపకులు, క్రమశిక్షణ, నూరుశాతం ఫలితాలు, విశాలమైన భవనాలు, ఆహ్లాదకరమైన వాతావరణం, జోగన్నపాలెం మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి విద్యా సంస్థలు రాష్ట్రంలో మరిన్ని ఏర్పాటు కావాలన్నారు. ఏపీలో తాను ఇలాంటి విద్యా సంస్థలను ఇప్పటివరకు చూడలేదన్నారు. సమాజం పట్ల ఉన్నత భావం, సేవా దృక్పథం కలిగిన ఫౌండర్ మహ్మద్ వలీవుల్లా, కళాశాల అధ్యాపకులు సమష్టి కృషి వల్ల ఇదంతా సాధ్యపడిందని యాజమాన్యాన్ని, అధ్యాపకులను అభినందించారు. అనంతరం తరగతి గదులు, కిచెన్, క్రీడాప్రాంగణం, లైబ్రరీ, వృత్తివిద్యాకేంద్రం, మసీదులను పరిశీలించారు.

వెనుకబడిన వర్గాలకు అండగా జగన్



ఉండి పెదపేటలో శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు, జాన్సన్‌ను సత్కరించిన దృశ్యం

- శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్
- ఉండి పెదపేట చర్చిలో ఘన సన్మానం

ఉండి: రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల సంక్షేమం, అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. ఆదివారం ఉండి పెదపేట లూథరన్ చర్చిలో చర్చి కార్యదర్శి చిట్టూరి జోషి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్‌తో పాటు వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిద జాన్సన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోషేన్‌రాజు, జాన్సన్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందిన వారికే పెద్దపీట వేసేవారని, కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కనీస గుర్తింపు లేని ఎన్నో సామాజిక వర్గాల వారికి ప్రాధాన్యత లభించిందన్నారు. రాష్ట్రంలో అన్ని కులాలకు గుర్తింపునిచ్చి వారి పురోభివృద్ధికి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి క్యాబినెట్ ర్యాంక్‌తో చైర్మన్లు, డైరెక్టర్లను నియమించారన్నారు. కేవలం ఓటు బ్యాంక్‌గా మాత్రమే మిగిలిపోయి రాజకీయంగా వెనుకబడిన ఎస్సీ, క్రిస్టియన్లకు తగిన గుర్తింపు ఇచ్చి ఉన్నత స్థానంలో నిలబెట్టిన గొప్ప వ్యక్తి వైఎస్ జగన్ అన్నారు. గత పాలకుల మాదిరిగా కాకుండా కులమతాలు, రాజకీయాలకు అతీతంగా పరిపాలిస్తూ సామాజిక న్యాయం చేస్తున్న దేశంలోనే మొట్టమొదటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎస్సీ, బీసీలకు కమ్యూనిటీ హాల్స్, శ్మశాన వాటికల కొరకు వారు చేసిన ప్రతి విన్నపాలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందిస్తోందన్నారు. అలాగే ఎస్సీ సర్టిఫికెట్ల విషయమై వచ్చిన విజ్ఞప్తులను ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. మహానేత వైఎస్సార్‌పై చూపిన అభిమానాన్ని వైఎస్ జగన్‌పై చూపించినందుకు ఆయనెంతో సంతోషించారన్నారు. క్రిస్టియన్ల కొరకు ప్రతి గ్రామ పరిధిలో ఎకరం భూమిని శ్మశానం కొరకు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. మనల్ని గౌరవించి మన పురోభివృద్ధికి దోహదం చేస్తున్న జగన్ అన్నకు మనమంతా తోడుగా ఉండి దీవిద్దామని మోషేన్‌రాజు, జాన్సన్ అన్నారు. తొలుత మోషేన్‌రాజు, జాన్సన్‌లను భారీ పూల మాలతో ఘనంగా సన్మానించారు. సర్పంచ్ కమతం సౌజన్య, ఉప సర్పంచ్ గొట్టుముక్కల కల్యాణ్‌వర్మ, తాడేపల్లి మోతీలాల్, సంఘ పెద్దలు అద్దంకి పేతురు, మాంద్రు లాజరు, కాట్రగడ్డ రవి, కాటిక శాంతారావు, గాతల జాన్, చిట్టూరి రత్నరాజు, వాసుపల్లి విజయ్‌కుమార్, ఉండ్రు అబ్రహం పాల్గొన్నారు.

25 మంది జూదరుల అరెస్టు.. రూ.1.30 లక్షల నగదు స్వాధీనం

కైకలూరు: కైకలూరు శివారు ఏలూరు రోడ్డులో పేకాట శిబిరంపై ఆదివారం తెల్లవారుజామున సిబ్బందితో కలిసి దాడి చేసి 25 మంది వ్యక్తులను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ఎవీఎస్ నాగరాజు చెప్పారు. వారి నుంచి రూ.1.30 లక్షల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైకుంఠం క్యూకాంప్లెక్స్‌కు మరమ్మతులు



క్యూకాంప్లెక్స్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలోని తాత్కాలిక వైకుంఠం క్యూకాంప్లెక్స్‌కు మర్మతులు చేస్తున్నారు. భక్తులు వేచి ఉండే ఈ క్యూ కాంప్లెక్స్ పైకప్పు పూర్తిగా దెబ్బతింది. వర్షం కురిసిన ప్రతిసారి భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో మరమ్మతు పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తికావడానికి నాలుగైదు రోజులు సమయం పడుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

బలివేలో ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్‌దేశ్ శర్మ

ముసునూరు: బలివేలోని మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఆదివారం పరిశీలించారు. గ్రామ సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, ఈఓ విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ, ఉత్సవ ప్రాంగణాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలివే రామలింగేశ్వరస్వామిని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆలయ నిర్మాణ చరిత్ర, స్వామి మహిమలు అడిగి తెలుసుకున్నారు. ఉత్సవ ప్రాంగణం, స్నానఘట్టాలను పరిశీలించారు. పటిష్ట భద్రత కల్పించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఆయన వెంట నూజివీడు డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్ గౌడ్, ఇతర అధికారులు ఉన్నారు.

పాటల పోటీల విజేతలు వీరే



పెనుగొండలో రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలు

పెనుగొండ: చివటం సత్యనారాయణ నాగరత్నం స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి పెనుగొండలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పాటల పోటీల్లో విజేతల వివరాలను పోటీల కన్వీనర్ చివటం సుబ్బారావు ఆదివారం వెల్లడించారు. ప్రథమ బహుమతిని పీవీబీ శ్రీధర్ (వేల్పూరు), ద్వితీయ బహుమతిని మట్టపర్తి సాయిబాబా (అమలాపురం), తృతీయ బహుమతిని వి.త్రిమూర్తులు, ప్రత్యేక బహుమతులను కే రాజు (విశాఖపట్నం), ఎం.వెంకట్రావు (పెదపాడు)లతో పాటు మరో ఏడుగురు పొందారన్నారు. చివటం సత్యనారాయణ, నాగరత్నంల జ్ఞాపకార్థం గుమ్మాపు కృష్ణకు, ప్రముఖ సంగీత విద్వాంసులు కీర్తిశేషులు జీవీఎస్ సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం ఎస్.కోటేశ్వరరావులకు అవార్డులు అందించినట్లు తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా ఎస్.కోటేశ్వరరావు, కె.సింధు, గుండాల మహాలక్ష్మీ వ్యవహరించగా, సినీగేయ రచయిత రసరాజు, ఆచార్య రంకిరెడ్డి రామ్మోహనరావు, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు పాల్గొన్నారు.

లారీ ఢీకొని కొండపల్లి వాసి మృతి



పేరాల ప్రసాద్ (ఫైల్)

కుక్కునూరు: తెలంగాణ రాష్ట్రం ఊట్లపల్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలానికి చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికుల తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన పేరాల ప్రసాద్ (28) బర్లమడుగు గ్రామానికి చెందిన సోయం రాజుతో కలిసి ఆదివారం ట్రాక్టర్‌లో పత్తి మూటలను వేసుకుని అశ్వారావుపేటలో అమ్మేందుకు బయలుదేరారు. మార్గమధ్యలో ఊట్లపల్లి గ్రామం వద్ద స్పీడ్ బ్రేకర్‌ను దాటించే క్రమంలో ట్రాక్టర్ వేగం తగ్గించగా, వెనుక నుంచి గ్రానైట్ లోడుతో వేగంగా వస్తున్న లారీ ట్రాక్టర్‌ను ఢీకొంది. దీంతో ట్రాక్టర్ ఇంజిన్‌పై కూర్చున్న ప్రసాద్ రోడ్డుపై పడిపోగా అతని పైనుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రసాద్‌కు భార్య, మూడేళ్ల కుమార్తె ఉండగా, ఇటీవలే భార్య ఆడబిడ్డను ప్రసవించింది. ప్రసాద్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

స్పిన్‌టెక్స్‌లో అగ్నిప్రమాదం.. ముగ్గురికి తీవ్ర గాయాలు

నూజివీడు: మండలంలోని రావిచర్ల పరిధిలో ఉన్న ప్రవీణ్ స్పిన్‌టెక్స్ కంపెనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈనెల 11న ప్రమాదం సంభవించగా యాజమాన్యం గోప్యంగా ఉంచి గాయపడిన వ్యక్తులకు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయిస్తోంది. ప్రమాదంలో జీవన్, సుమంత్, కిరణ్ అనే వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. అయితే ప్రమాద సమాచారాన్ని పోలీసులకు, రెవెన్యూ సిబ్బందికి తెలియజేయకుండా యాజమాన్యం గోప్యంగా ఉంచింది. దీనిపై నూజివీడు రూరల్ సీఐ ఆర్.అంకబాబు మాట్లాడుతూ ప్రమాదం విషయాన్ని యాజమాన్యం తమకు తెలియజేయలేదని, ఘటనపై విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

వరిలో ఉధృతంగా కాండం తొలుచు పురుగు

- దాళ్వాలో దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం
- నారుమడి నుంచే సస్యరక్షణతో నష్టం నివారణ



తోలకపూడిలో ఏపుగా పెరుగుతున్న దాళ్వా వరిపైరు



వరి పైరును ఆశించిన కాండం తొలుచు పురుగు



సాక్షి, భీమవరం: దాళ్వా వరిపైరు ఏపుగా పెరుగుతోంది. గడిచిన సార్వా సీజన్‌లో ప్రతికూల వాతావరణంతో పెద్దగా దిగుబడులు సాధించలేకపోవడంతో రైతులంతా దాళ్వా దిగుబడులపైనే ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 2.16 లక్షల ఎకరాల విస్తీర్ణంలో దాళ్వా పంట వేయగా ఇప్పటికే కొంతమంది రైతులు రెండో విడత ఎరువులు వేయడం, కలుపుతీయడం వంటి పనులు పూర్తి చేశారు. అయితే ఇటీవల అనేక ప్రాంతాల్లో వరి పైరులో కాండం తొలుచు పురుగు ఉధృతంగా ఉండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చీడపీడల్లో ఈ పురుగు వల్లే తీవ్ర నష్టం

వరి పంటను ఆశించే చీడపీడల్లో కాండం తొలుచు పురుగు కీలకమైంది. వరి పైరును ప్రధానంగా ఐదు రకాల కాండం తొలిచే పురుగులు ఆశిస్తాయి. వీటిలో పసుపు రంగు కాండం తొలిచే పురుగు వల్ల ఎక్కువ నష్టం ఉంటుంది. దీనిని గుర్తించడానికి ఆడ రెక్కల పురుగు గడ్డి రంగులో ఉండి ముందు జత రెక్కల మధ్యలో నల్లటి మచ్చ కలిగి కంది గింజ పరిమాణంలో గుడ్లను ఆకు కొనలపైన పెట్టి గోధుమ రంగులో ఉండే వెంట్రుకలతో కప్పి ఉంచుతుంది. గుడ్లు పెట్టిన ఎనిమిది రోజుల్లోగా పిల్ల పురుగులు బయటకు వస్తాయి.

నష్టాలు ఇవే

తొలి దశలో పిల్ల పురుగులు ఆకు చివరన తినడం వల్ల ఆకులపై వెడల్పాటి తెల్లటి చారలు ఏర్పడతాయి. తరువాత దశలో కాండంపై రంధ్రాన్ని చేసి లోపలికి పోయి లోపల ఉండే కణజాలాన్ని తినివేయడం వల్ల మొవ్వ చనిపోతుంది. చిరుపొట్ట దశలో అయితే కంకికి కింద నుంచి పోషకాలు సక్రమంగా అందక తెల్ల కంకులు వస్తాయి. పురుగు ఆశించిన కాండాన్ని చీల్చి చూస్తే లేత పసుపు రంగు లద్దె పురుగులను లేదా పురుగు విసర్జించిన పదార్థాన్ని చూడవచ్చు.

సమగ్ర సస్యరక్షణ ఇలా..

పొలంలో చదరపు మీటరుకు ఒక తల్లి పురుగు లేదా ఒక గుడ్ల సముదాయం కనిపించిన వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఎకరాకు 10 వరకు లింగాకార్షక బుట్టలు పెట్టి పెద్ద సంఖ్యలో మగ రెక్కల పురుగులను ఆకర్షించడం ద్వారా ఈ పురుగు ఉధృతి తగ్గించుకోవచ్చు. ట్రైకోగ్రామా జపానికం అనే గుడ్డు పరాన్న జీవులను నాట్లు వేసిన 35వ రోజు నుంచి ఎకరాకు 20 వేల చొప్పున 15 రోజుల వ్యవధిలో మూడు నాలుగు దఫాలుగా పొలంలో విడుదల చేయాలి. పంట పిలకలు వేసేదశలో లీటరు నీటికి ఎసిఫేట్ 75 ఎస్పీ మందు 1.5 గ్రాములు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్పీ మందును 2 గ్రాములు లేకుంటే క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీ లీటర్ల మందును పైరుపై పిచికారీ చేయాలి. చిరుపొట్ట దశలో ఎకరాకు 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు లేదా 8 కిలోల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు వాడుకోవాలి.

సకాలంలో సస్యరక్షణ చేపట్టాలి



దాళ్వా పంటపై కాండం తొలిచే పురుగు ఆశించే అవకాశం ఎక్కువ. ఈ పురుగు ఆశించడం వల్ల కంకులు తప్పలుగా మారి పంట దిగుబడి తగ్గిపోతుంది. అయితే సకాలంలో పైరుపై సస్యరక్షణ చర్యలు తీసుకుంటే నష్టాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చును.

– డాక్టర్ ఎం.భారతలక్ష్మి, అసోసియేట్ డైరెక్టర్, అగ్రికల్చర్ రీసెర్చ్ సెంటర్, మార్టేరు

క్లుప్తంగా

బాల్యం నుంచే నైతిక విద్య బోధించాలి



జమాతె ఇస్లామిహింద్ సమావేశం

తాడేపల్లిగూడెం: మంచి సమాజం కోసం పిల్లలకు బాల్యం నుంచే నైతిక విద్యను బోధించాలని జమాతే ఇస్లామిహింద్ గూడెం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. మహిళా విభాగం ఇన్‌చార్జి చాంద్ సుల్తాన్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర వ్యాప్త ఉద్యమంలో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ముత్యాల శిరీష, ఆస్మా, ఆఫ్రీనా తదితరులు పాల్గొన్నారు.

చిత్రకారుడు వెంపటాపునకు ప్రశంసలు



విజయవాడలో చిత్రకారుడు వెంపటాపును సత్కరించిన నిర్వాహకులు

తణుకు అర్బన్: విజయవాడ బాలోత్సవ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల చిత్రకళా ప్రదర్శనలో తణుకుకు చెందిన చిత్రకారుడు వెంపటాపు ప్రదర్శనకు ప్రశంసలు దక్కాయి. 45 మంది చిత్రకారులు పాల్గొన్న ఈ చిత్రకళా ప్రదర్శనలో తాను ప్రదర్శించిన చిత్రానికి పలువురు ప్రశంసించి సత్కారం, మెమెంటో అందజేసినట్లు వెంపటాపు వివరించారు.

అన్ని రంగాల పురోగతికి బడ్జెట్ దోహదం



కేంద్ర బడ్జెట్‌పై అవగాహన సదస్సు

తాడేపల్లిగూడెం: సమ్మిళిత అభివృద్ధి ధ్యేయంగా రూపకల్పన చేసిన కేంద్ర వార్షిక బడ్జెట్ భారతదేశ భవిష్యత్తు చిత్రంలో సమూల మార్పులకు బీజం వేసిందని ఆర్థిక నిపుణులు లంక దినకర్ అన్నారు. పట్టణంలోని గమిని ఫంక్షన్ హాలులో ఆదివారం చాంబర్ ఆఫ్ కామర్స్ సౌజన్యంతో 2023–24 కేంద్ర వార్షిక బడ్జెట్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అమృతకాల బడ్జెట్ ద్వారా 2045 నాటికి దేశ సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా అన్ని రంగాల పురోగతికి ప్రధాని నరేంద్రమోదీ బాటలు వేశారని దినకర్ అన్నారు. రాజకీయాలకు వివక్షకు తావులేకుండా బడ్జెట్ అమలు చేయడం హర్షణీయమని పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఉన్నమట్ల కబర్డీ, చిట్యాల రాంబాబు, ఈతకోట తాతాజీ, ముప్పిడి సురేష్ రెడ్డి, పీవీ.రామారావు పాల్గొన్నారు.

విష్ణు విద్యా సంస్థల విరాళం



విరాళం అందజేస్తున్న చైర్మన్ కేవీ విష్ణురాజు

సాక్షి, భీమవరం : స్థానిక ముస్లింల శ్మశాన వాటికలో పూడిక పనుల నిమిత్తం విష్ణు విద్యా సంస్థల చైర్మన్ కేవీ విష్ణు రాజు ఆదివారం రూ.3 లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు ముస్లిం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జనాబ్ షేక్ రబ్బానీ, జనాబ్ ఎండీ జలాలుద్దీన్ బాబా కృతజ్ఞతలు తెలిపారు. వారు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో దివంగత డాక్టర్ బీవీ రాజు హయాం నుంచి విష్ణు విద్యా సంస్థల యాజమాన్యం ముందుంటారని అన్నారు. గతంలో ఉర్దూ పాఠశాల నిమిత్తం కూడా రూ.లక్ష విరాళం ఇచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో ముస్లిం జేఏసీ కన్వీనర్ ముహమ్మద్ సిద్దీఖ్, ముస్లిం కమిటీ గౌరవ అధ్యక్షుడు ఎండీ అల్లావుద్దీన్ నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ వద్ద వీఆర్‌ఏల ధర్నా

సాక్షి, భీమవరం : వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఫేస్ అటెండెన్స్ నుంచి మినహాయించాలని కోరుతూ మంగళవారం భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు వీఆర్‌ఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సుబ్బారావు, గౌరవ అధ్యక్షుడు ఎం.ఆంజనేయులు తెలిపారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఫేస్ అటెండెన్స్ రద్దుచేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. వీఆర్‌ఏలు అందరూ పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేత్రపర్వంగా నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ పూజలు



బల్లిపాడు కాశీవిశాలాక్షి విశ్వేశ్వరస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు



విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గోపూజ చేస్తున్న భక్తులు

అత్తిలి: బల్లిపాడులో వేంచేసియున్న కాశీవిశాలాక్షి విశ్వేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో గణపతి ప్రయుక్త ఆదిత్యాది నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం విగ్రహ ప్రతిష్ఠ అనంతరం గోపూజ చేసారు. మహాపూర్ణాహుతి, ధ్వజారోహణం, శాంతికల్యాణం నిర్వహించారు. వెలవలపల్లి బాలసుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు బాదంపూడి సోమశేఖరశర్మ, వెలవలపల్లి కాశీ, పలువురు వేదపండితుల సమక్షంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కార్యక్రమానికి హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హాజరైన భక్తులకు అన్నదానంచేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ ప్రోత్సాహకులు ఆకుల పండుస్వామి, ఆకుల భుజంగరావు, తలారి శ్రీనివాస్, ట్రస్టుబోర్డు చైర్మన్ ధనుమూరి తాతాజీ, సర్పంచ్ కశిరెడ్డి బాలాజీ, సొసైటీ అధ్యక్షుడు గుబ్బల ఆంజనేయులు, వడ్డి నాగేశ్వరరావు, విత్తంశెట్టి సత్తిబాబు, తోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

12 మందికి వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకులోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతి ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో 12 మందికి ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. ఆదివారం సంచార వైద్యశాల ద్వారా ప్రముఖ నేత్ర వైద్యుడు హుస్సేన్ అహ్మద్, జనరల్ వైద్యుడు బొండాడ వెంకటేశ్వర్లు పట్టణం, వేల్పూరు, మండపాక, కే సావరం గ్రామాల్లో మంచానికే పరిమితమైన వారికి ఇంటివద్దకే వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. సంఘ సభ్యుడు అనుమోలు సుబ్బారావు ఆర్థిక సహకారంతో మందులను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి అర్జి భాస్కరరావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

తాడేపల్లిగూడెం: పేద కుటుంబాలకు విద్య, వైద్యావసరాల నిమిత్తం కోలా రోహిణి గంగాధర్ ఫౌండేషన్ తరపున సాయమందిస్తున్నట్లు సంస్థ బాధ్యులు రాజన్ ఆర్ముగనాథన్, రాజన్ సుభాషిణి తెలిపారు. ఆదివారం పట్టణంలో బొగ్గి శ్రీనివాసరావు, గుండుగొలను ధనలక్ష్మి, చెరుకూరి వరలక్ష్మయ్యకు రూ.66,515 సాయం అందించారు.

కరాటే పోటీల్లో బల్లిపాడు విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చిన బల్లిపాడు విద్యార్థులతో ఉపాధ్యాయులు

అత్తిలి: కరాటే పోటీల్లో బల్లిపాడు మదనగోపాల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదివారం నిడదవోలులో నిర్వహించిన కరాటే పోటీల్లో వివిధ విభాగాల్లో బహుమతులు, పతకాలు సాధించిన వారిని స్కూల్ ప్రిన్సిపాల్ తిరుపతి శ్రీనివాస్ అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ తిరుపతి అనిత మాట్లాడుతూ బాలికల ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవడం అవసరమన్నారు. కరాటే ఉపాధ్యాయుడు రామాంజనేయరాజు, హెచ్‌ఎం బాడిగ నాగేశ్వరరావు, ఇన్‌ఛార్జ్ ఆకుల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గృహసారథులు, వలంటీర్లు సమన్వయంతో పనిచేయాలి



కొత్తూరులో మాట్లాడుతున్న సచివాలయాల కన్వీనర్ తిరుమల శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్: గృహసారథులు, గ్రామ వలంటీర్లు సమన్వయంతో పనిచేయాలని సచివాలయ కన్వీనర్ తిరుమల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తూరు సచివాలయంలో వలంటీర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమల శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి, సమస్యలు పరిష్కరించి వారికి లబ్ధి చేకూర్చాలన్నారు. ఈ విషయంలో గృహ సారథులు, వలంటీర్లు కలిసి పనిచేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూర్చాలనేది వైఎస్సార్ సీపీ లక్ష్యమన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు, ఇతర సమాచారాన్ని గృహ సారథులు వారి పరిధిలోని కుటుంబాల వారికి తెలియజేయాలన్నారు. సమావేశంలో సచివాలయాల కన్వీనర్లు బాదం సూర్యనారాయణ, తిరుమల సూర్యనారాయణ పాల్గొన్నారు.

వ్యసనాల నిర్మూలనకు కృషి సామాజిక బాధ్యత



మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్) : స్థానిక శాంతి హాస్పటల్‌లో మత్తు పదార్థాల వినియోగం వల్ల వచ్చే ప్రాణాంతక వ్యాధులపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మానసిక వైద్యులు జీవీ రమణరావు మాట్లాడుతూ మద్యపానం, ధూమపానం, డ్రగ్స్ వంటి వ్యసనాలు ముందు సరదాగా మొదలవుతాయని, క్రమేపీ అలవాటుగా మారి ప్రాణాంతకంగా మారతాయని అన్నారు. ముఖ్యంగా యువత వీటి బారిన పడి జీవితాలు ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యసనాల నిర్మూలనను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. అనంతరం ప్లకార్డుల ప్రదర్శనతో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనేక మంది రోగులు డాక్టర్ జీవీ రమణ రావుని ప్రశ్నలు అడిగి నివృత్తి చేసుకున్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, భీమవరం లయన్స్ క్లబ్ కార్యదర్శి నరహరి శెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధి బాధితుడికి ఆర్థిక సాయం



ఏనుగువానిలంకలో కిడ్నీ వ్యాధి బాధితుని భార్యకు ఆర్థిక సహాయం అందజేస్తున్న పెన్మెత్స బుద్ధరాజు

యలమంచిలి: మండలంలోని ఏనుగువానిలంక గ్రామానికి చెందిన బందెల గంగయ్య (42)కు రెండు కిడ్నీలు చెడిపోయాయి. దీంతో అతనికి డయాలసిస్ చేయిస్తుండడంతో మంచానికే పరిమితమయ్యాడు. వారి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో మందులు కొనుగోలు, కుటుంబ పోషణకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు వసుధ ఫౌండేషన్ పాలకొల్లు శాఖ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజుకు వివరించారు. అతను ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజుకు విషయం చెప్పడంతో రామరాజు స్పందించి రూ.10 వేలు నగదు పంపించారు. ఆ నగదును ఆదివారం బుద్ధరాజు ఏనుగువానిలంక తీసుకువచ్చి గంగయ్య భార్య రాజమణికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈద ప్రమీల, ఉప సర్పంచ్ జంపన సూర్య వెంకటరాజు, గ్రామ పెద్దలు వినుకొండ వెంకటేశ్వరరావు, హరికుమార్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత లక్ష్యాలు

నరసాపురం రూరల్: విద్యతోనే ఉన్నత లక్ష్యాలు సాధ్యమని నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ అన్నారు. నరసాపురం– పాలకొల్లు రహదారిలో ఉన్న సంసిద్ధ్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణ, నిబద్ధతతో కృషి చేస్తే సాధించడం కష్టమేమీ కాదన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ వాసా శ్రీనివాసరావు, డైరెక్టర్ వాసా మాధవి, సీఈఓ సనో, అకాడమిక్ హెడ్ ఆర్.వేణి, ప్రిన్సిపాల్ వలవల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పైబోయిన కుటుంబానికి పలువురి పరామర్శ

అత్తిలి: మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణను పలువురు పార్టీ నాయకులు పరామర్శించారు. ఆదివారం అత్తిలిలో పైబోయిన విజేయులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తణుకు మండల ఎంపీపీ రుద్రా ధనరాజు, తణుకు జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణ వెంకటరమణ, అత్తిలి మండల నాయకులు పైబోయినను పరామర్శించారు.

ఆశ కార్యకర్తలకు పనిభారం తగ్గించాలి

కాళ్ల : ఆశ కార్యకర్తలకు పనిభారం తగ్గించాలని ఆశ వర్కర్ల జిల్లా కార్యదర్శి దిగుబాటి జ్యోతి కోరారు. ఆశ వర్కర్ల కాళ్ల మండల విస్తృత స్థాయి సమావేశం స్థానిక మహంకాళమ్మ గుడి ఆవరణలో రెడ్డి దేవి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన జ్యోతి మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అధికారుల వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం భీమవరంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. సమావేశంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు గొర్ల రామకృష్ణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత ధ్యాన శిక్షణ

వీరవాసరం : స్థానిక శ్రీసీతారామస్వామి వారి దేవస్థానంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ ఆధ్వర్యంలో ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. నరసాపురానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ యం.కృష్ణవేణి జ్ఞాన బోధ చేశారు. ధ్యాన సాధన ద్వారా నాడీ మండల శుద్ధి జరిగి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత పొందుతామన్నారు. జిల్లా కో–ఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్ మాట్లాడుతూ తూ.గో.జిల్లా పేరవరంలో నిర్మిస్తున్న శ్రీవశిష్ట గౌతమి పిరమిడ్ మహాశక్తి క్షేత్రంలో స్వర్ణమాలా పత్రీజీ ఆధ్వర్యంలో మార్చి 16 నుంచి 22 వరకు జరగనున్న ఉగాది ధ్యాన జ్ఞాన యజ్ఞానికి అందరూ హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సన్నిధి ఉదయ్, మేడిశెట్టి కృష్ణారావు, తీడ నాగరాజు, వర్రె విశ్వేశ్వరరావు, పాలా మంగతాయారు, బి.శ్రీదేవి, బోలెం యర్రమ్మ, బాజింకి సావిత్రి, వాణి పాల్గొన్నారు.

ఘనంగా కోత పండుగ

సాక్షి, భీమవరం : క్రైస్తవ దేవాలయాల వద్ద ఆదివారం క్రైస్తవులు కోత పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా స్థానిక బేతని చర్చి వద్ద వివిధ రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. పాస్టర్ ఎస్.పుష్పరాజ్ మాట్లాడుతూ కోత పండుగ అంటే కృతజ్ఞతార్పణల పండుగ అని, ఈ సందర్భంగా క్రైస్తవులు తమ పంటల ప్రథమ ఫలాలను దేవునికి అర్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పట్టా దేవరాజ్, పీజే కెనడీ, పి.రతన్, పీజే విజయవరం, పి.సుదర్శన్‌కుమార్, పాకెర్ల జోసఫ్ లూథర్, గంటా సుందర్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్‌టీయూ జిల్లా సమావేశం

పాలకోడేరు : పశ్చిమగోదావరి జిల్లా ఎస్‌టీయూ 76వ కౌన్సిల్ సమావేశం ఆదివారం శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనకు త్వరలోనే ఎస్టీయూ ద్వారా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గుత్తుల శ్రీనివాస్, జవహర్రాజు, రామచంద్రరావు పాల్గొన్నారు.

సరళాదేవికి నాదస్వర విద్వాంసుల స్మారక అవార్డు



బీవీఆర్ కళాక్షేత్రంలో వావిలాల సరళాదేవి, వెంకటరమేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: తణుకు పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు, సంఘ సేవకురాలు వావిలాల సరళాదేవి, వెంకటరమేష్‌కు తాడేపల్లిగూడెంలో నిర్వహించిన మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి కార్యక్రమంలో ప్రముఖ నాదస్వర విద్వాంసులు నాగుర్ సాహెబ్, మదీనా బీబీ స్మారక అవార్డును అందజేశారు. శనివారం రాత్రి తాడేపల్లిగూడెంలోని బీవీఆర్ కళా క్షేత్రంలో నిర్వహించిన ఘంటసాల వర్ధంతి కార్యక్రమానికి సంస్థ వ్యవస్థాపకుడు ఎస్ కాశిం అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర సాంస్కృతిక, నాటక పరిషత్ సమాఖ్య అధ్యక్షుడు బుద్దాల వెంకటరామారావు సరళాదేవి, వెంకటరమేష్ దంపతులను సత్కరించి అవార్డును ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ తాడేపల్లి మోహనరావు, సబ్ రిజిస్ట్రార్ లంక వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ సరళాదేవి కళాకారులకు అందిస్తున్న సేవలను కొనియాడారు.

26న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తణుకులో లోగోను ఆవిష్కరించిన 1983-86 బ్యాచ్ డిగ్రీ విద్యార్థులు

తణుకు టౌన్: ఈనెల 26న తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1983–86 సంవత్సరాల్లో బీఏ డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్న ఆ బ్యాచ్ విద్యార్థి, రాష్ట్ర ఎన్‌జీవో సంఘాల జేఏసీ నాయకుడు ఆర్‌ఎస్ హరనాథ్ చెప్పారు. ఆదివారం తణుకులోని ఎన్‌జీవో హోంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుమారు 40 ఏళ్ల క్రితం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిన విద్యార్థులు నేడు రాష్ట్రంలోనే కాక, ఇతర రాష్ట్రాల్లోనూ వివిధ ఉద్యోగాలు, వృత్తి, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. వారిని ఒక వేదికపైకి తీసుకువచ్చి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనాటి గురువులను సత్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆనాటి కళాశాల లోగోను ఆవిష్కరించారు. ఆనాటి విద్యార్థులైన న్యాయ వాది కామన మునిస్వామి, రాంపల్లి కృష్ణసాయి, రెడ్డి రాధారాణి, కేవీ రమణ, కే వెంకటేశ్వరరావు, పీ బాపిరాజు, పీ దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

రేపు హిందూ ధార్మిక సంస్థల నిరసన

పాలకొల్లు సెంట్రల్: హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా శాంతియుతంగా నిరసన తెలియజేస్తామని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలరాజు అన్నారు. ఆదివారం స్థానిక రైల్వే గేటు సమీపంలో సరస్వతి శిశుమందిర్‌లో విశ్వహిందూపరిషత్, భజరంగదళ్, బీజేపీ, ధర్మపరిరక్షణ, క్షీరారామలింగేశ్వర సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాలరాజు మాట్లాడుతూ హిందువులపై ఒక పథకం ప్రకారం దాడులు జరుగుతున్నాయన్నారు. గతంలో 30 యాక్ట్ అమల్లో ఉన్నప్పుడు రెచ్చగొట్టే విధంగా ప్రదర్శనలు చేసినప్పుడే పోలీసులు చర్యలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితి ఇంతవరకూ వచ్చేదికాదన్నారు. ఈ నెల 14న శాంతియుతంగా నిరసన తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు మాధవశర్మ, జిల్లా కార్యదర్శి సునీత, భజరంగదళ్ జిల్లా ప్రచారక్ కస్తూరి అఖిల్, క్షీరా రామలింగేశ్వర స్వామి సేవా సమితి అధ్యక్షులు శీరం ఆనందకృష్ణ, బీజేపీ నాయకులు జక్కంపూడి కుమార్, క్షీరా రామలింగేశ్వర స్వామి, అష్ట భుజ లక్ష్మీనారాయణ స్వామి, కనకదుర్గమ్మ ఆలయాల చైర్మన్లు కోరాడ శ్రీనివాసరావు, గాదె వెంకన్న, కావలి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

కొండావారి చర్చిలో పెద్దల సమావేశం

మొగల్తూరు: స్థానిక కొండావారిపాలెం లూథరన్ దేవాలయంలో ఆదివారం పీసీసీ, ఎల్‌సీసీ, సంఘ పెద్దల సమావేశాన్ని నిర్వహించారు. ప్యారిస్ 2 ఫాస్టర్ తలారి కొండయ్య మోజెష్ మార్టిన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కొండావారిపాలెం, రాజుగారితోట, గోడావారిపేట, నక్కావారిపాలెం, పాలకమ్మ చెరువు ఇంజేటివారిపాలెం సంఘ పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డెలిగేట్‌గా కొండావారిపాలెం సభ్యులు బొడ్డుపల్లి సుబ్బారావు, ఆల్టరనేట్ డెలిగేట్‌గా నక్కావారిపాలెం సభ్యులు కోనా ప్రసాదరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వర్దనపు సుధాకర్, కొల్లాబత్తుల జేమ్స్, బందారు విజయ్ కుమార్, కారిపల్లి రవి, సీఆర్ కొండా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నరసింహ స్వామి కల్యాణం

మొగల్తూరు: మండలంలోని కాళీపట్నం పడమర గ్రామంలో ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కల్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఏటా మాఘమాసంలో స్వామి వారి కల్యాణాన్ని జరిపించడం ఆనవాయితీ. జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, మీనాక్షి దంపతులు స్వామి వారి కల్యాణం క్రతువును నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి కల్యాణాన్ని వీక్షించేందుకు వచ్చారు.అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

హ్యాకథాన్ పోటీల్లో విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న కళాశాల అధ్యక్షుడు సాగి ప్రసాదరాజు

సాక్షి, భీమవరం : స్థానిక ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన 24 గంటల హ్యాకథాన్ పోటీల్లో ఈ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ, తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ డేటా సైన్స్‌లో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు గొంటు నరసింహారెడ్డి, అడ్డాల వెంకటలక్ష్మి శ్రావణి మాట్లాడుతూ ఈ కామర్స్‌లో తక్కువ ఖర్చుతో వినియోగదారుడికి వస్తువు చేరే విధంగా వెబ్‌సైట్ రూపొందించామని, తమ ప్రాజెక్టుకు ప్రథమ స్థానం లభించిందని చెప్పారు. ఈ పోటీల్లో విశాఖపట్నం అనిట్స్ విద్యాసంస్థ ద్వితీయ స్థానం సాధించగా, పూణేకి చెందిన విశ్వకర్మ ఇనిస్ట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విద్యార్థులు కన్సోలేషన్ బహుమతి అందుకున్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 42 మంది విద్యార్థులకు బ్రెయిన్ ఓ విజన్ సంస్థ నెల రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తామని ప్రకటించింది. కళాశాల అధ్యక్షుడు సాగి ప్రసాద్ రాజు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్ఆర్‌కే నిశాంత్ వర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ ఈ పోటీల్లో 250 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీ రంగరాజు, ఐటీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ బీహెచ్‌వీఎస్ రామకృష్ణంరాజు, కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.హేమలత, బ్రెయిన్ ఓ విజన్ వ్యవస్థాపకులు సీఈవో డి.గణేష్ నాగ్, కన్వీనర్ డాక్టర్ కే కిషోర్‌రాజు పాల్గొన్నారు.